పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు
- దసరా పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



లింగన్నపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ: పేదల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం హన్వాడ మండలంలోని రామన్నపల్లి, వేపూర్, లింగన్నపల్లి, గొండ్యాల్, కిష్టంపల్లి తండా, ఎర్రగట్టుతండా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను వచ్చే దసరా పండుగ నాటికి నిర్మించుకొని గృహప్రవేశం చేయాలని ఆకాంక్షించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి పేదలను నిలువునా మోసం చేసిందని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రతి గడపకు తప్పనిసరిగా అందిస్తామని భరోసానిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం అందించే ఆర్థికసాయంతో లబ్ధిదారులకు నచ్చిన విధంగా నిర్మించుకోవచ్చని తెలిపారు. పేదల సంక్షేమానికి దేశంలో ఎక్కడా లేని పథకాలను అమలుచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, డీసీసీ ప్రధాన కార్యదర్శులు కృష్ణయ్య యాదవ్, కృష్ణయ్య, ఓబీసీ సెల్ కార్యదర్శి రమేశ్ యాదవ్, అధ్యక్షుడు మహేందర్, నాయకులు వెంకటాద్రి, అచ్చెన్న, రామకృష్ణ, నవనీత, యాదిరెడ్డి, రఘు, ఖదీర్, సుబ్బారెడ్డి, బాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నియోజకవర్గ అభివృద్ధిలో సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కొత్తగా ఎన్నికైన 'ఫోరం' కమిటీ సభ్యులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజానికి సీనియర్ సిటిజన్స్ సేవలు ఎంతో అవసరమన్నారు. అన్ని రంగాల్లో మహబూబ్‌నగర్ అభివృద్ధి చెందడానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, ఉపాధ్యక్షుడు ఎ.రాజసింహుడు, ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం, సంయుక్త కార్యదర్శి ఎల్.గంగాధర్, కార్యవర్గ సభ్యులు నాగభూషణం, రాములు పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బాలవర్ధన్‌గౌడ్

జడ్చర్ల టౌన్/మిడ్జిల్: పేదల సంక్షేమం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ అన్నారు. దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ 11ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూనే.. పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. సమావేశంలో మండల ఇన్‌చార్జి సామల నర్సింహులు, నాయకులు రమేశ్‌జీ, మహేశ్ యాదవ్, కాశన్న, మహేందర్ నాయక్, గౌరీశంకర్, మోహన్ నాయక్, శివకుమార్, గోపాల్ నాయక్, సుధాకర్ పాల్గొన్నారు.

■ కేంద్ర ప్రభుత్వం పంటలకు కనీస మద్దతు ధర పెంచడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తంచేస్తూ మిడ్జిల్ బస్టాండ్ వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర నాయకుడు జానర్దన్‌రెడ్డి మాట్లాడారు. సమావేశంలో మండల అధ్యక్షుడు నరేశ్ నాయక్, నాయకులు రాజేశ్వర్, తిరుపతి, లాలూ, అరవింద్, భీమయ్య, వెంకటయ్య, దామోదర్‌రెడ్డి, శేఖర్, వాసుదేవ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా కోట మైసమ్మ బోనాలు



బోనాలతో కోట మైసమ్మ ఆలయానికి వెళ్తున్న భక్తులు

భూత్పూర్: మండలంలోని మద్దిగట్లలో శనివారం కోట మైసమ్మ బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా కోట మైసమ్మ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సతీమణి కవిత పాల్గొని కోట మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తమ్మన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



నవాబుపేట: సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ జనార్దన్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్‌కు అపరిచిత వ్యక్తులు పంపించే మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. ముఖ్యంగా తెలియని లింక్‌లను ఓపెన్ చేయరాదన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రలోభాలకు గురిచేసి మోసాలకు పాల్పడుతున్నారని.. మెసేజ్ రూపంలో వచ్చే అలాంటి వాటిని నమ్మవద్దని సూచించారు. అదే విధంగా పిల్లలను ఫోన్‌కు దూరంగా ఉంచాలన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని.. ఎవరైనా ఇస్తే తల్లిదండ్రులే బాధ్యులవుతారని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



దేవరకద్ర: రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు అన్నారు. శనివారం రెడ్‌క్రాస్ సొసైటీ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దేవరకద్ర కొత్త బస్టాండ్ సమీపంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలను రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో పాటు బీఆర్ఎస్ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్ యాదవ్, వెంకటేశ్, దొబ్బలి ఆంజనేయులు, చల్మారెడ్డి, యుగంధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవితేజ, యాదయ్య, నవీన్, భార్గవ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

కపిలేశ్వర ఆలయానికి రూ.4లక్షల విరాళం



భూత్పూర్: మండలంలోని పాత కొప్పెటలో శ్రీకపిలేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం గ్రామానికి చెందిన తూము మణ్యపురెడ్డి కుమారుడు క్రాంతికుమార్‌రెడ్డి శనివారం రూ.4లక్షల విరాళం అందించారు. అదే విధంగా ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనకు అయ్యే ఖర్చు భరిస్తామని మణ్యపురెడ్డి కూతుళ్లు సరిత, మమత ప్రకటించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



అడ్డాకుల: మండలంలోని కాటవరం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. బీటీరోడ్డు పక్కన ఎలాంటి రక్షణ కంచె లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఎప్పుడే ప్రమాదం సంభవిస్తుందో తెలియని దుస్థితి నెలకొంది. ఇక్కడే రోడ్డు మలుపు ఉంది. రోడ్డుపై వచ్చే వాహనాలు అదుపు తప్పితే నేరుగా ట్రాన్స్‌ఫార్మర్‌ను తగిలే అవకాశం లేకపోలేదు. తక్కువ ఎత్తు ఉన్న దిమ్మెపై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో ఆడుకుంటూ వెళ్లే పిల్లలు ఎవరైనా తీగలకు తగిలినా ముప్పు తప్పదు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తగిన రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'ఆర్టీసీ బస్సులు ఆపాలి'

రాజాపూర్: మండల కేంద్రం గుండా అటు హైదరాబాద్, ఇటు జడ్చర్ల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు స్థానిక బస్టాండ్ వద్ద ఆపకుండా వెళ్తుండటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని ఏబీవీపీ నాయకులు, గోనాయో వ్యవస్థాపకుడు ప్రశాంత్ ఆచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బస్సుల కోసం ప్రయాణికులు వేచి ఉంటున్నా.. బస్సులు ఆపకుండా వెళ్తున్నాయన్నారు. దీంతో హైదరాబాద్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, షాద్‌నగర్ పట్టణాలకు వెళ్లే విద్యార్థులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కొందరు తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి రాజాపూర్ బస్టాండ్ వద్ద బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

యథేచ్ఛగా ఇసుక, మట్టి అక్రమ రవాణా



దేవరకద్ర మండలం బండర్‌పల్లి వాగు సమీపంలో ఇసుకతో వెళ్తున్న టిప్పర్



గుడిబండలో మట్టి తరలింపు

దేవరకద్ర/అడ్డాకుల: నియోజకవర్గ కేంద్రమైన దేవరకద్ర మండలంతో పాటు అడ్డాకుల మండలంలో ఇసుక, మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. దేవరకద్ర గుండా రాత్రి, పగలు తేడా లేకుండా టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నారు. బండర్‌పల్లి సమీపంలోని వాగులో ఓవైపు నారాయణపేట జిల్లా ఉండగా.. మరోవైపు మహబూబ్‌నగర్ జిల్లాలు ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు అంటున్నారు. అయితే పక్క జిల్లా పరిధిలో నుంచి టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నారు. శనివారం ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు దాదాపు 10 ఇసుక టిప్పర్లు దేవరకద్ర జాతీయ రహదారిపై వెళ్లాయి. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. తమ పరిధిలో ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు.

దేవరకద్ర చెరువు గుంతలమయం..

దేవరకద్ర పెద్ద చెరువులో నుంచి మట్టి అక్రమ రవాణాతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులో మట్టిని తవ్వి ఇటుక తయారీకి తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

గుడిబండలో మట్టి తరలింపు..

అడ్డాకుల మండలంలోని గుడిబండ శివారు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. గ్రామ సమీపంలో ఉన్న కొండగుట్ట వద్ద భారీ యంత్రాలతో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా రాచాల శివారులోని పెద్దవాగులో నిర్మిస్తున్న చెక్‌డ్యాం వద్దకు తరలిస్తున్నట్లు గుడిబండ గ్రామస్తులు తెలిపారు. రెవెన్యూ, మైనింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మట్టి తవ్వకాలు చేపట్టడంతో గ్రామస్తులు శనివారం ఆందోళనకు దిగారు. యంత్రాలను అడ్డుకుని మట్టి తవ్వకాలను నిలిపివేశారు. అక్రమంగా కొనసాగుతున్న మట్టి తవ్వకాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై ఆర్ఐ సృజన్‌ను వివరణ కోరగా.. మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



దేవరకద్ర పెద్ద చెరువులో మట్టి తరలింపుతో ఏర్పడిన గోతులు

కాంగ్రెస్ నాయకుల హర్షం

నవాబుపేట: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సభ విజయవంతం కావడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ.. రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నవాబుపేటలో రూ.50కోట్లతో 132 కేవీ సబ్‌స్టేషన్, రుద్రారం, కొండాపూర్, చౌడూర్ గ్రామాలకు 33 కేవీ సబ్‌స్టేషన్ల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నవాబుపేట శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, భూపాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, వాసుయాదవ్, అంజన్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తులసీరాం, సంతోష్, శంకర్ ఉన్నారు.

రేపు వాహనాల వేలం

ఆత్మకూర్: ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఆత్మకూర్‌లో సోమవారం వాహనాల వేలం నిర్వహిస్తున్నామని సీఐ యమునాధర్ రావు తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలు వేలం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్నవారు నిర్ణీత రుసుము చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



కోయిల్‌కొండ: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని హెచ్ఎం నర్సింహులు కోరారు. మండలంలోని ఇబ్రహీంనగర్‌లో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు విశాలమైన తరగతి గదుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఆటో

పాన్‌గల్: అదుపుతప్పి ఆటో పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన శ్రీనునాయక్ కుటుంబం తండా నుంచి హైదరాబాద్‌కు ఆటోలో వెళ్తున్న క్రమంలో దావాజిపల్లి స్టేజీ సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ఆటోలో ఉన్న ఐదుగురి కుటుంబ సభ్యుల్లో ఒక మహిళకు రక్త గాయాలయ్యాయి. ఆటో అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఓ చెట్టుకు తాకి ఆటో ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. క్షతగాత్రురాలిని వెంటనే ప్రైవేట్ వాహనంలో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలు నియంత్రించడంలో విఫలం

అమరచింత: నకిలీ విత్తనాలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని, వానాకాలం వరి పంట కొనుగోళ్లు పూర్తయినా నేటికీ రైతు ఖాతాల్లో బోనస్ డబ్బులను జమ చేయలేదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం రైతు సంఘం మండల రెండో మహాసభ నిర్వహించగా..ఏఐకేఎస్ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో వెంకటేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేసి వస్తున్న ముస్లింలు



ఈద్గా వద్ద ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు



జిల్లా కేంద్రంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక బక్రీద్

- జిల్లావ్యాప్తంగా ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు



మిడ్జిల్ మండల కేంద్రంలో..



మూసాపేట ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


సాక్షి నెట్‌వర్క్: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను శనివారం జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు జడ్చర్ల, భూత్పూర్, దేవరకద్ర పట్టణాలతో పాటు మిడ్జిల్, నవాబుపేట, రాజాపూర్, అడ్డాకుల, చిన్నచింతకుంట, కోయిల్‌కొండ తదితర మండలాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అంతకు ముందు మసీదుల్లో నమాజ్ ఆచరించి.. ఊరేగింపుగా ఈద్గాల వద్దకు చేరుకున్నారు. అక్కడ మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేయించి ధార్మిక సందేశం ఇచ్చారు. అదే విధంగా ముస్లింలు తమ పూర్వీకుల సమాధులను సందర్శించి పూలమాలలు వేశారు. పేదలకు ఖుర్బానీ పంపిణీ చేశారు. కాగా, ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనల అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఈద్ మిలాప్ వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ జానకి, పట్టణ ప్రముఖులు

ఘనంగా ఈద్ మిలాప్

స్టేషన్ మహబూబ్‌నగర్: బక్రీద్ పండుగను పురస్కరించుకొని శనివారం ఖౌమీ ఏక్తా కమిటీ ప్రధాన కార్యదర్శి రఫీక్ పటేల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఈద్ నమాజ్ అనంతరం ప్రత్యేక ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బక్రీద్ సంప్రదాయ వంటకమైన షీర్ ఖుర్మాను అతిథులకు వడ్డించారు. 35ఏళ్ల నుంచి కులమతాలకు అతీతంగా అన్ని పండుగ పర్వదినాల్లో ఈద్ మిలాప్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఎస్పీ డి.జానకి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, భగవంతు రావు, షబ్బీర్ అహ్మద్, అహ్మద్ సనా, అబ్దుల్ జకీ, మహ్మద్ ఇసాక్, మీర్ షోయబ్ అలీ, హాఫీజ్ ఇద్రీస్, మహ్మద్ సాదిక్ పాల్గొన్నారు.




కోయిల్‌కొండలో..



జడ్చర్ల మదర్సా వద్ద..



భూత్పూర్ ఈద్గా వద్ద..



కౌకుంట్లలో..